
సాక్షి బాపట్ల

మంగళవారం ౹ 8 ౹ అక్టోబర్ ౹ 2024




అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థాన అభివృద్ధి పనులను సోమవారం దేవదాయ శాఖ ఉప కమిషనర్ కె.బి.శ్రీనివాస్ పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 30,722 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 33,543 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



అద్దంకి రూరల్: పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వీధుల్లోని చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. రక్షిత తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి సారించాలని, రోడ్ల మరమ్మతులు, వీధిలైట్లు అమర్చడం వంటివి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పేదల పక్షపాతి ఎస్‌ఆర్ శంకరన్



బాపట్ల: పేదల పక్షపాతి ఎస్‌ఆర్ శంకరన్ అని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఎస్ ఆర్ శంకరన్ వర్ధంతి సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలోని ఎస్‌ఆర్ శంకరన్ విగ్రహానికి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో కలసి పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. బెటర్ ఫర్ బాపట్ల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తృత్వ పోటీల్లో విజేతలైన ప్రీతిశ్రీ, కావ్యలకు బహుమతులు అందజేశారు. వరదల సమయంలో విశేషంగా సేవలందించిన కలెక్టర్ మురళి, జేసీ ప్రఖర్ జైన్‌లను సంస్థ ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, బెటర్ ఫర్ బాపట్ల సంస్థ కార్యదర్శి సాయిబాబు పాల్గొన్నారు.

డీటీసీగా సీతారామిరెడ్డి బాధ్యతల స్వీకారం



పట్నంబజారు: రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సోమవారం కె.సీతారామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. స్వర్ణభారతీ నగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. విజయవాడ డీటీసీగా పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరుకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు డీటీసీగా విధులు నిర్వర్తించిన షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీతారామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్ఞాన దివ్యకు పతకాలు



తెనాలి రూరల్: దక్షిణాఫ్రికాలో ఆదివారం జరిగిన కామన్వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన నాగం జ్ఞానదివ్య ప్రతిభ కనబర్చారు. ఆమె 84 ప్లస్ జూనియర్ విభాగంలో నాలుగు కాంస్య పతకాలు సాధించారు. స్క్వాట్‌లో 160 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 55 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 157.5 కిలోల బరువు ఎత్తారు. మొత్తం 372.5 కిలోల బరువులను ఎత్తి నాలుగు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నాగ దివ్యను కోచ్ కొల్లిపర నాగశిరీష, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి రైతుబజార్లలో టమాటా కిలో రూ.50

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలోని అన్ని రైతు బజార్లలో మంగళవారం నుంచి కిలో టమాటా రూ.50కే విక్రయాలు జరపనున్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.65 నుంచి రూ.90 వరకు పలుకుతోందని పేర్కొన్నారు. దీంతో ఇతర జిల్లాల నుంచి టమాటాలను కొనుగోలు రాయితీపై రైతుబజార్లలో విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు. ఒక్కొక్కరికీ కిలో చొప్పున అమ్ముతారన్నారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



నగరోత్సవంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు, (ఇన్‌సెట్‌లో) మహాచండీదేవి అలంకరణలోని దుర్గమ్మకు హారతిస్తున్న అర్చకుడు



త్రిశక్తి.. సర్వసిద్ధి

శ్రీమహాచండీదేవిగా పూజలందుకున్న దుర్గమ్మ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో సోమవారం అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజాది కార్యక్రమాల అనంతరం ఆలయ ఈవో రామరావు, పోలీసు, రెవెన్యూ అధికారులు తొలి దర్శనం చేసుకున్నారు. ఆదివారం వీఐపీల తాకిడితో సామాన్య భక్తజనం తీవ్ర ఇబ్బందులకు గురికాగా, ఈ ప్రభావంతో సోమవారం దర్శనాలపై కనిపించి అన్ని క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. వీఐపీల పేరిట విచ్చేసిన భక్తులు ఓం టర్నింగ్ మొదలు, కొండపై సమాచార కేంద్రం, ప్రొటోకాల్ కేంద్రం, గాలిగోపురం వద్ద భారీగా నిలిచిపోయారు. ఉత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రానికి ఒక రోజే గడువు ఉండటంతో పోలీసు, రెవెన్యూ అధికారులు ఒకటికి, రెండు సార్లు ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తూ ఏర్పాట్లను సమీక్షించారు. కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, ఈవో రామరావు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను సమీక్షించారు. ప్రత్యేక ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చనలకు సైతం ఉభయదాతలు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆదాయం రూ. 82.13 లక్షలు

దసరా ఉత్సవాలలో సోమవారం దేవస్థానానికి రూ.82.13 లక్షల మేర ఆదాయం సమకూరింది. రూ.500 టికెట్ల విక్రయం ద్వారా రూ.34.73 లక్షలు, రూ.300 టికెట్లతో రూ.9.82 లక్షలు, రూ.100 టికెట్ల విక్రయంపై రూ.6.21 లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ. 28.58 లక్షలు, ప్రత్యేక పూజలు, ఆర్జిత సేవల టికెట్ల విక్రయం ద్వారా రూ.1.42 లక్షలు, ఇతర సేవల ద్వారా రూ.1.37 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



కుటుంబ సమేతంగా కుంకుమ పూజ..

నగరోత్సవం.. ఆనంద పరవశం

దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం ఆది దంపతుల నగరోత్సవ సేవ కనుల పండువగా సాగింది. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్త జనుల కోలాట నృత్యాల నడుమ ఆది దంపతులు ముందుకు సాగగా, భక్తులు జయజయ ధ్వానాలతో పాదం కలిపారు. కనకదుర్గనగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది.

అన్న ప్రసాదం తనిఖీ..

దసరా ఉత్సవాలలో సాయంత్రం వేళ భక్తులకు దేవస్థానం పంపిణీ చేసే అల్పాహారాన్ని ఆలయ ఈవో రామరావు సోమవారం తనిఖీ చేశారు. మహా మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను ఈవో ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భక్తులు కోరినంత అల్పాహారాన్ని అందించి వారి ఆకలిని తీర్చాలని సిబ్బందికి సూచించారు.

పాట్లు.. పడిగాపులు

కూటమి నేతల తీరుతో భక్తులకు నీరసం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలి దసరా ఉత్సవాలలో భక్తులు అమ్మవారి దర్శనానికి నానా తంటాలు పడుతున్నారు. కూటమి నాయకుల సిఫారసులు, పోలీసుల అత్యుత్సాహం, శాఖల మధ్య సమన్వయ లోపం వెరసి భక్తులకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. టికెట్ కొనుగోలు చేసినా గంటల కొద్దీ క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సి వస్తోందంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిఫారసులతో యాతన..

నగరంలో మూడు నియోజకవర్గాల శాసనసభ్యులతో పాటుగా ఎంపీ కార్యాలయం నుంచి వస్తున్న సిఫారసులతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దేవస్థానం వీవీఐపీల కోసం యాప్ తయారు చేసి అందులో శాసనసభ్యులకు, ఎంపీకు ఇతర ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించింది. వాటి ద్వారా బుక్ చేసుకున్న అధికార పార్టీలకు చెందిన నాయకులు కొండపైకి పోటెత్తుతున్నారు. ఫోన్‌లో వచ్చిన మెసేజ్‌లను పదేపదే చూపిస్తూ దానిని పలుమార్లు వినియోగిస్తున్నారు. వారంతా నేరుగా చిన్న రాజగోపురం వద్దకు వచ్చి అక్కడ ఉన్న సిబ్బందిపై విరుచుకు పడుతున్నారు. దానికి తోడు ఆయా కార్యాలయాల నుంచి ఫోన్లు రావటంతో వారందరినీ వీఐపీలుగా గుర్తించి వారిని లోపలకు వదులుతున్నారు. దీనివల్ల టికెట్లు కొనుగోలు చేసి వెళ్తున్న భక్తులకు గంటల కొద్దీ ఆలస్యమవుతోంది.

ఉత్సవ కమిటీతో తలనొప్పులు

కూటమి ప్రభుత్వం దసరా ఉత్సవాలకు నియమించిన సేవా కమిటీతో అటు అధికారులకు ఇటు భక్తులకు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏకంగా 56 మందితో ఉన్న ఈ జంబో కమిటీలో ఒక్కొక్కరికీ 20 మంది వరకూ దర్శనం చేయించుకునేందుకు అనధికారికంగా అనుమతినిచ్చినట్లు తెలిసింది. ఎవరైనా గట్టిగా అడిగితే ఫలానా ఎమ్మెల్యే తాలుకా లేదా ఎంపీ బంధువునంటూ హడావుడి చేసి మరి లోపలకు వెళ్తున్నారు. దీని ప్రభావం రూ.500 క్యూలైన్‌పై పడి అందులోని భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఎన్నడూ లేదు..

గతంలో ఎన్నడూ ఈ విధమైన పరిస్థితులు లేవని ఆలయ అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రావటం, అందులో మూడు పార్టీల నేతలు ఎవరికి వారు తమ మెహర్బాని కోసం ఆలయాన్ని వాడుకుంటున్నారంటూ విమర్శిస్తున్నారు.



క్యూలైన్లో గంటల కొద్దీ వేచి ఉండటంతో నీరసిస్తున్న చిన్నారులు

ప్రొటోకాల్ పక్కదారి..

దసరా ఉత్సవాలలో విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ప్రొటోకాల్ కల్పించని దేవస్థానం, పోలీసు శాఖ.. టీడీపీకి చెందిన ఓ నాయకురాలికి ప్రొటోకాల్ కల్పించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆమె కారును ఓం టర్నింగ్ వద్ద నిలిపేశారు. అక్కడి నుంచి నాలుగైదు చోట్ల తాను మేయర్‌నని చెప్పుకుంటూ ఆలయ ప్రాంగణానికి చేరుకోవాల్సి వచ్చింది. మరో వైపున టీడీపీకి చెందిన ఓ చోటా నాయకురాలు అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆమెకు సేవా కమిటీ సభ్యులు రాచమర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించడమే కాకుండా మీడియా పాయింట్ పోడియంను ఎక్కించి మాట్లాడించారు. నగర ప్రథమ పౌరురాలిని పట్టించుకోకుండా టీడీపీ కార్యకర్తకు రాచమర్యాదలు కల్పించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.



వాహనాలు ఎక్కే సమయంలో వాగ్వాదం



భక్తులతో వాగ్వాదం చేస్తున్న పోలీస్



దేవస్థానం బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న భక్తులు

డ్యూటీ పాస్‌ల దుర్వినియోగం..

దసరా ఉత్సవాలలో డ్యూటీ పాస్‌లు దుర్వినియోగం కాకుండా ఉండాలని ఈ ఏడాది దేవస్థానం కొత్తగా డిజిటల్ డ్యూటీ పాస్‌లను ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులకు అందజేసింది. డ్యూటీ పాస్ పొందాలనుకునే వారు తొలుత దేవస్థానం రికార్డులో పొందుపరిచిన ఆధార్ కార్డుతో పాటు ఫొటో అందించారు. అయితే ఉత్సవాలలో తొలి రెండు, మూడు రోజులు కనిపించని డ్యూటీ పాస్‌లు నాల్గో రోజుకు వచ్చే సరికి అనధికార వ్యక్తుల వద్ద దర్శనమిచ్చాయి. ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాల్లో పని చేసే సిబ్బందితో పాటు వన్‌టౌన్ మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారాలు చేసే వారు సైతం డ్యూటీ కార్డులు ధరించి దర్జాగా అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధుల కార్యాలయాల్లో పని చేసేవారు సేవా కమిటీ సభ్యులకు ఏ మాత్రం తీసిపోకుండా దర్శనాలు చేయిస్తున్నారు. మరో వైపున రెవెన్యూ, పోలీసు శాఖలోనూ ఇదే తరహా వ్యవహారం కనిపించింది. దీంతో ఆలయ అధికారులు, సిబ్బంది ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తమ కుటుంబంలోని వ్యక్తులు, భార్య, పిల్లలను అమ్మవారి దర్శనానికి తీసుకువచ్చేందుకు అవకాశం లేకుండా చేసిన వారు ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లోకి డ్యూటీ కార్డులు ఎలా వెళ్లాయని నిలదీస్తున్నారు. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తామని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

మంచి బేరం కాదనీ..

మిగిలింది రెండు రోజులే

- 'మద్యం' దరఖాస్తులు నామమాత్రమే
- సోమవారం నాటికి 485 దరఖాస్తులు
- సగటున నాలుగు దరఖాస్తులు వచ్చిన వైనం
- అడ్డుకుంటున్న పచ్చ సిండికేట్
- జిల్లాలో 117 మద్యం దుకాణాలు
- రూరల్ పరిధిలో పలు దుకాణాలకు దరఖాస్తు పడని దుస్థితి
- గతంతో పోలిస్తే మద్యం దుకాణాల ఏర్పాటుకు పెరిగిన ఖర్చులు
- పచ్చనేతలకు 20 శాతం వాటాలు
- భయంతో మద్యం దుకాణాలకు దూరంగా వ్యాపారులు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: గడువు ముగుస్తున్నా ప్రభుత్వం అనుకున్న రీతిలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు పడలేదు. ఈ నెల 1 నుంచి 9 వతేదీవరకూ మద్యం షాపుల దరఖాస్తులకు ప్రభుత్వం గడువు విధించగా సోమవారం నాటికి ఏడు రోజులు ముగిసింది. ఇంక రెండు రోజుల గడువు మాత్రమే మిగిలిఉంది. అయినా అనుకున్న రీతిలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు రాలేదు.

జిల్లాలో దుకాణాలు ఇలా..

జిల్లాలో 117 సాధారణ మద్యం దుకాణాలకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆదివారం నాటికి 243 దరఖాస్తులు మాత్రమే రాగా సోమవారం సాయంత్రానికి ఈ సంఖ్య 485కు చేరింది. ఈ లెక్కన ఒక్కొక దుకాణానికి సగటున నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతంలో ఒక మద్యం దుకాణానికి 20 నుంచి 30 దరఖాస్తులు పడగా నేడు ఈ సంఖ్య నామమాత్రంగా మారింది.

సిండికేట్‌తో రూరల్‌లో పడని దరఖాస్తులు..

రూరల్ మండలాల్లోని దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా పడలేదని తెలుస్తోంది. పచ్చనేతలు సిండికేట్‌గా ఏర్పడి మద్యం వ్యాపారులు, ఆశావహుల దరఖాస్తులను వేయనీయకుండా అడ్డకుంటున్నట్లు సమాచారం. సిండికేట్ వారికి డబ్బులు చెల్లించి, పచ్చనేతలకు 20 శాతం వాటా ఇచ్చేందుకు అంగీకరించిన వారు మాత్రమే మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు వేసేందుకు అంగీకరిస్తున్నారు. స్వతంత్రంగా దరఖాస్తులు వేయాలనుకునేవారిని అడ్డుకుంటున్నారు. కాదు, కూడదని దరఖాస్తులు వేసినా దుకాణం రాగానే సిండికేట్‌లో కలిపేయాలని కండీషన్ పెడుతున్నారని సమాచారం. సగటున ఒక్కో దుకాణానికి మూడు దరఖాస్తులకు మించి రాలేదు. రూరల్ పరిధిలో ఉన్న 50 శాతం దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా పడలేదని తెలుస్తోంది. కానీ ప్రస్తుతం నామామాత్రంగా కూడా దరఖాస్తులు పడకపోవడంతో ప్రభుత్వం నివ్వెర పోయింది.

అంచనా తిరగబడింది..

మరో వైపు మద్యం షాపుల పేరుతో వేలకోట్లు పిండేందుకు సిద్ధమైన ప్రభుత్వం, మద్యం దుకాణం కోసం ఒక దరఖాస్తుకు రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ రుసుం నిర్ణయించారు. దీంతో పాటు 25 శాతం షాపులకు రూ.55 లక్షలు, 75 శాతం షాపులకు రూ.65 లక్షల లైసెన్స్‌ఫీజు పెట్టారు. గతంలో లాగా మద్యం దుకాణాల కోసం వ్యాపారులు ఎగబడతారని, తద్వారా రూ.కోట్లు కొల్లగొట్టవచ్చని భావించగా పరిస్థితి తిరగబడింది.

కేటగిరి వారీ ఫీజు..

జిల్లాలో వేమూరు, అమృతలూరు, చుండూరు, కారంచేడు, చినగంజాం, అద్దంకి రూరల్, కొరిశపాడు, జె.పంగులూరు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల పరిధిలో 36 దుకాణాల వార్షిక లైసెన్సు ఫీజు రూ.55 లక్షలు కాగా బాపట్ల, చీరాల, రేపల్లె పట్టణాలతో పాటు బాపట్ల రూరల్, కర్లపాలెం, రేపల్లె రూరల్, భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, కొల్లూరు, చీరాల రూరల్, వేటపాలెం, బల్లికురవ, సంతమాగులూరు, పర్చూరు, మార్టూరు మండలాల పరిధిలోని 81 మద్యం దుకాణాలకు వార్షిక లైసెన్సు ఫీజు రూ.65 లక్షలు ఉంది. ప్రతిఏడాదికి ఇది పది శాతం పెరగనుంది. ఇది కాకుండా మద్యం దుకాణం కోసం వేసే ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ రుసుం చెల్లించాల్సిఉంది. దుకాణం రావాలంటే సగటున పది దరఖాస్తులు వేయాల్సి ఉంటుంది. దీంతో పాటు మద్యం షాపు ఏర్పాటుకు అన్నింటినీ కలుపుకుంటే రూ.95 లక్షలు పెట్టుబడి అవుతోంది. ప్రస్తుతం మద్యం అమ్మకాలు పరిశీలిస్తే లాభాలు వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఈ లెక్కన పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో వ్యాపారులకు ఇది మరింత భారంగా మారింది. దానికి తోడు పచ్చనేతల కప్పం పెద్ద మొత్తంలో ఉండడంతో వ్యాపారులు మద్యం దుకాణాల కోసం పోటీ పడడం లేదు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

కలెక్టర్ జె.వెంకట మురళి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక కలెక్టర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. మొత్తంగా 150 అర్జీలు నమోదయ్యాయి. తక్షణమే స్పందించిన కలెక్టర్ తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు పీజీఆర్ఎస్ డ్యాష్ బోర్డును పరిశీలించాలని కోరారు. నమోదైన అర్జీలను పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అర్జీలు పునరావృతమైతే అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని భావించాల్సి ఉంటుందని సున్నితంగా హెచ్చరించారు. గడువు తీరిన అర్జీలు చీరాల ఆర్డీఓ పరిధిలో నాలుగు ఉండటంపై ఆరా తీశారు. 21 రెవెన్యూ దరఖాస్తుల గడువు తీరినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047కు సంబంధించిన విజన్ బాపట్ల, నూతన ఆవిష్కరణ, ప్రణాళిక రూపొందించడం కోసం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మంత్రులు, ప్రజా ప్రతినిధులు సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రైతుల నుంచి నీటి తీరువా పన్నులు వసూలు చేయాలని కోరారు. రెవెన్యూ అంశాలపై నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని చెప్పారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కనగాల గ్రామస్తుల డిమాండ్



హైవేపై ఆందోళనకారులకు సర్దిచెబుతున్న సీఐ

చెరుకుపల్లి: కనగాలకు చెందిన తాపీమేస్త్రి కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జాతీయ రహదారిపై గ్రామస్తులు సోమవారం బైఠాయించారు. తాపీమేస్త్రి కుమార్తె గుళ్లపల్లిలో పదో తరగతి చదువుతోంది. మండల పరిధిలోని రాజవోలు గ్రామానికి చెందిన కుంచల భార్గవ్ రెడ్డి ప్రేమించమని వెంటపడతున్నాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుసుకుని, కోపంతో భార్గవ్‌రెడ్డి, అతని అనుచరుడు విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో కత్తి, ఇనుప సుత్తి తీసుకుని బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులపై దాడి చేయగా రేపల్లె ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఘటన చోటుచేసుకుని ఇంత సమయమైన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు నిరసనకు దిగారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల్లో అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేస్తామని రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేసుకోండి


ఏపీ ఎన్జీఓ సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని గుంటూరు జిల్లా ఎన్జీజీఓ సంఘ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం జరిగిన ఎన్జీజీవో ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులే కాదు వారి కుటుంబ సభ్యులు కూడా పట్టభద్రులుగా ఉన్నారన్నారు. వారిని కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ఓటర్లుగా నమోదు చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. అన్ని శాఖల్లో ఉద్యోగులందరికీ ఈ విషయాన్ని తెలియజేయాలని ఆయా శాఖలోనే సంఘ నాయకులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు అందరూ కూడా నవంబర్ 6 వరకు జరిగే ఈ ఓటర్ నమోదు కార్యక్రమం గురించి ఉద్యోగులను చైతన్యపరిచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని జయప్రదంగా చేయాలన్నారు. ఎన్జీజీఓ హోమ్‌లో ఓటరు నమోదుకు సంబంధించిన సదుపాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 6 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ వారి కుటుంబ సభ్యులు ఈ కేంద్రం ద్వారా ఫారం 18ని పొందవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ఎన్జీజీవో సంఘ కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షుడు ఎస్‌పిఎస్ సూరి, కార్యదర్శి కల్యాణ్ కుమార్, విజయ్‌బాబు, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ కె.లక్ష్మీరమ్య, పట్టణ మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.లక్ష్మి ప్రసన్న, బి.శైలజ, కోటమ్మ, పద్మజ, సునీత, పలు శాఖల నుంచి వచ్చిన ఎన్జీజీవో నాయకులు పాల్గొన్నారు.

బాలుడి ఉసురు తీసిన ఆటో హ్యాండిల్ గేర్

- ఒక్కసారిగా కదలడంతో కిందకు దూకిన బాలుడు
- గోడకు తగిలి మరణం
- రాజుబంగారుపాలెంలో విషాదం


జీవన్ మృతదేహం


ఇంటి గోడను ఢీకొట్టిన ఆటో

చినగంజాం: ఇంజన్ ఆన్‌లో ఉన్న ఆటో హ్యాండిల్ గేర్‌ను పట్టుకోవడంతో జరిగిన ప్రమాదంలో ఓ బాలుడు కిందపడి దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటన మండలంలోని రాజుబంగారుపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎస్. రమేష్ వివరాల మేరకు.. తిరుపతి జిల్లా బాలయ్యపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన నవురు వెంకటేష్ టైలరింగ్ వృత్తి చేసుకుంటూ చినగంజాంలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల భార్యాభర్తలకు వివాదం కావడంతో భార్య సుజాత పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి జీవన్ (7), కుమార్తె ఉన్నారు. వెంకటేష్‌కి ఇదే గ్రామంలో రామాలయం వద్ద ఉంటున్న ఆటో డ్రైవర్ ఆట్ల మురళీరెడ్డి మంచి స్నేహితుడు. ఈ నేపథ్యంలో బాలుడు జీవన్ మురళీరెడ్డి ఇంటికి వెళ్లి వారి పిల్లలతో ఆడుకుంటూ అక్కడే ఉంటున్నాడు. సోమవారం ఉదయం మురళీరెడ్డి వచ్చి '' మీ నాన్న నిన్ను తీసుకొని రమ్మన్నాడు '' అని చెప్పి జీవన్‌ను ఆటో ఎక్కి కూర్చోమన్నాడు. ఈ క్రమంలో మురళీరెడ్డి ఇంజన్ స్టార్ట్ చేసి నిలిపి ఉంచి ఇంట్లోకి వెళ్లాడు. ఈ సమయంలో బాలుడు ఆటోలో ఎక్కి కూర్చొని హ్యాండ్ గేర్‌ను కదిలించడంతో ఒక్కసారిగా ముందుకు కదిలింది. ఆటో ఎదురుగా నిర్మాణంలో ఉన్న ఇంటి గోడను ఢీకొడుతుండటంతో భయాందోళనకు గురైన జీవన్ అందులోంచి దూకబోయి గోడకు బలంగా ఢీకొన్నాడు. దాంతో నోరు, ముక్కుల వెంబడి రక్తం రావడంతో చికిత్స నిమిత్తం చీరాలకు తరలించారు. మార్గంమధ్యలో జీవన్ మృతి చెందాడు. ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లిన బాలుడ్ని పరీక్షించిన వైద్యులు మరణించాడని ధ్రువీకరించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రమేష్ సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి అవసరం

- షార్ శాస్త్రవేత్తలు గ్రహదురై, రవికుమార్
- ఎన్‌ఈసీలో వరల్డ్ స్పేస్ వీక్-24
- పాల్గొన్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ


మాట్లాడుతున్న షార్ డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై

నరసరావుపేట రూరల్: అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌డీఎస్‌సీ షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహదురై తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరల్డ్ స్పేస్ వీక్-2024 ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో షార్ డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై, షార్ జనరల్ మేనేజర్, శాస్త్రవేత్త కె.వి.ఎన్. రవికుమార్, జిలా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షార్ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ 1957 అక్టోబర్4వ తేదీన తొలి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్‌ను రష్యా అంతరిక్షంలోకి పంపటం జరిగిందన్నారు. 1967 అక్టోబర్ 10న రెండవ కృత్రిమ ఉపగ్రహం పంపారని తెలిపారు. దీనికి గుర్తుగా ప్రతి ఏడాది వరల్డ్ స్పేస్ వీక్ ఉత్సవాలను ఇస్రో జరుపుతుందని వివరించారు. ఇస్రో ఇప్పటి వరకు 125 ఉపగ్రహాలను, 97 ఆర్బిటాల్స్‌ను లాంచ్ చేసిందని తెలిపారు. 1969లో 7.5 సెం.మీ.లు ఉన్న రోహిణి ఉపగ్రహం నుంచి ప్రస్తుతం 200 టన్నుల బరువు 3 మీటర్ల వ్యాసం ఉన్న ఎల్‌వీఎం-3 ఉపగ్రహాలను అంతరిక్షానికి పంపే స్థాయికి చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం మానవాళి ఉపయోగించే వాహనాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, అడవుల నరికివేత వల్ల వాతావరణ పరిస్థితుల్లో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ షార్, ఇస్రో సంస్థలు మన దేశాన్ని ఎంతో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాయని తెలిపారు. చంద్రయాన్-3 ప్రతిష్టాత్మకమైన ప్రయోగమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్, వేస్ట్ డిస్పోజ్ వంటి ముఖ్య సమస్యలను దేశం ఎదుర్కొంటుందని తెలిపారు. వీటికి పరిష్కారాలు కనుగోనే దిశగా విద్యార్థుల ప్రయోగాలు ఉండాలని సూచించారు. అనంతరం ఇస్రో బృందం ఏర్పాటుచేసిన ప్యానల్స్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఎన్‌ఈసీ కళాశాల విద్యార్థులు తయారుచేసిన మినీ రాకెట్‌ను ప్రయోగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, అంతరిక్ష పరిశోధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు చెక్కు పంపిణీ



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. టీడీపీ గూండాల చేతిలో గాయపడిన చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి గ్రామానికి చెందిన కాశీప్రభాకర్‌కు పార్టీ అధినేత వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి నుంచి వచ్చిన రూ.50వేల చెక్కును సోమవారం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కూటమి నేతలు దాడులకు పాల్పడుతుండటంతో పాటు వారి ఆస్తులను కూడా ధ్వంసం చేయడం అమానుషమని డాక్టర్ గణేష్ ఖండించారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరు కేశవతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల రుణాలు రద్దు చేయాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సామూహిక రాయబార కార్యక్రమం


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

భట్టిప్రోలు: ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల నేపథ్యంలో డ్వాక్రా సంఘాల రుణాలు రద్దు చేయాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భట్టిప్రోలు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట సోమవారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి అధ్యక్షతన జి. సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ వరదల వల్ల రానున్న మూడు నెలలు పనులు ఉండవని, ప్రభుత్వం స్పందించి డ్వాక్రా మహిళల రుణాల్ని మాఫీ చేయాలని కోరారు. పొదుపులో ఉన్న నగదును గ్రూపులకు ఇప్పించాలని, బ్యాంకర్లు, మండల సమాఖ్య సిబ్బంది రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌తో సంబంధం లేకుండా వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందించాలని కోరారు. రైతులకు పంట నష్ట పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమం వద్దకు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.వి. రమణ, ఏపీఎం జి. శ్రీమన్నారాయణ వచ్చి, నష్ట పరిహారం త్వరగా అందే విధంగా చూస్తామని తెలిపారు. డ్వాక్రా రుణమాఫీ విషయం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, బ్యాంకర్ల నుంచి ఇబ్బంది కలగకుండా చూస్తామని ఉపాధి హామీ పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, దీపాల సత్యనారాయణ, బి. నాగమల్లేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు పల్లెపాలెం గ్రామాల నుంచి వందలాది మంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ రామయ్య

కొల్లూరు : కృష్ణా నదిలో ఈతకు దిగి బంతితో ఆడుకుంటూ నీటి ప్రవాహంలో గల్లంతైన యువకుడి మృతదేహం ఇరవై నాలుగు గంటల అనంతరం సోమవారం లభ్యమైంది. తెనాలి బీసీ కాలనీకి చెందిన బొడ్డపాటి శ్రీనివాస్ కుమారుడు నరేష్ (20) ఆదివారం స్నేహితులు ఆరుగురితో కలసి మండలంలోని చిలుమూరు కృష్ణా నదికి ద్విచక్ర వాహనాలపై వచ్చాడు. అనంతరం ముగ్గురు యువకులు నీటిలో దిగి బంతితో ఆడుకుంటున్నారు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న బంతిని తీసుకొచ్చేందుకు వెళ్లిన నరేష్ కొట్టుకుపోయి గల్లంతైన సంగతి తెలిసిందే. ఆదివారం చీకటి పడే వరకు ఈతగాళ్లు గాలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు నది వెంబడి వెతుకుంటూ వెళుతున్న క్రమంలో ప్రమాదం జరిగిన ప్రాంతానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని గాజుల్లంక వద్ద చెట్టుకు పట్టుకొని నిలిచి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా నరేష్‌గా గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు నదిలోంచి మృతదేహాన్ని కుటుంబసభ్యులు తీసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శవ పంచనామా అనంతరం పోలీసులు మృతదేహాన్ని వారికి అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి. ఏడుకొండలు తెలిపారు.

కౌలు రైతుల కష్టం కోసం ప్రత్యేక చట్టం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెం నాయుడు

గుంటూరు వెస్ట్ :రాష్ట్రంలో 80 నుంచి 90 శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారని, అయితే వారికి ఆశించిన స్థాయిలో లాభం రావడం లేదని, వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చంనాయుడు చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో మంత్రి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కు చట్టం 2024 కు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలతో తొలి ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 1956లో కౌలుదారుల చట్టం అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆతరువాత 2011లో మరో చట్టం వచ్చిందని, అయితే ఈ చట్టం 2016 వరకు అమలు కాలేదని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టాన్ని 0 నుంచి దాదాపు 40 శాతానికి పైగా కౌలు దారులకు ఉపయోగపడేలా అమలు చేశామన్నారు. భూమిలో కాయకష్టం చేసి పనిచేసే కౌలు రైతుకు జరిగే అన్యాయాలు ఈ నూతన చట్టంతో చాలా వరకు సమసి పోతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కౌలు రైతులు దారుణ నిర్లక్ష్యానికి గురయ్యారని పేర్కొన్నారు. ఈ నూతన చట్టం గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించిన తరువాతే అమలులోకి తెస్తారన్నారు. ముఖ్యంగా రైతాంగం ఆధునిక వ్యవసాయ పరికరాలను మరింత పెంచుకుంటే వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ చట్టం ద్వారా భూ యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా, కౌలు చేసే రైతులకు ఉపయోగం ఉండేలా రూపకల్పన చేశామన్నారు. వ్యవశాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతుకు ఫలం దక్కాలనే సిద్ధాంతంతో ఈ చట్టాలు రూపకల్పన చేశామని చెప్పారు. ఇటీవల కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు ఈ చట్టంపై ఆయనతో చర్చించడంతోపాటు, వివరాలు అందజేశామన్నారు. ఈ చట్టం ద్వారా భూమి సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ రూ. 6వేలు కూడా వారికే దక్కుతోందన్నారు. ఈ చట్టం ద్వారా భూ యజమానులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన పని లేదన్నారు. బ్యాంకర్లు కూడా కౌలు రైతులకు మరిన్ని రుణాలు ఇచ్చేందుకు ఈ చట్టం దోహదపడుతోందని వివరించారు. అనంతరం ఐదు జిల్లాల నుంచి వచ్చిన రైతులు చట్టం అమలుపై రైతుల సమస్యలపైన పలు సూచనలు, ఇబ్బందులను మంత్రికి తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్, గళ్లా మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొన్నారు.

చర్చలో ఎమ్మెల్సీలకు దక్కని ఆహ్వానం

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందో, జిల్లా అధికార యంత్రాంగ విస్మరించిందో గానీ చర్చలో పాల్గొనడానికి శాసన మండలి సభ్యులకు ఆహ్వానం అందలేదు. ఏపీ సాగుదారుల హక్కుల చట్టం-2024పై శాసన సభ్యులు, ఉన్నతాధికారులతోపాటు ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల రైతులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాంతీయ సమావేశం నిర్వహించింది. ఇందులో రైతులకు సంబంధించి కీలక చర్చ జరిగింది. నిత్యం రైతు సమస్యల పైనా, ముఖ్యంగా కౌలుదారుల హక్కుల కోసం పనిచేసే ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావుతోపాటు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నంలకు ఆహ్వానం అందలేదు. దీనిపై సాక్షి సదరు ఎమ్మెల్సీలను వివరణ కోరగా తమకు ఎటువంటి ఆహ్వానం లేదని చెప్పారు. కౌలు రైతుల హక్కుల సాధన కోసం పనిచేసే తమను విస్మరించి ఏం చర్చ నిర్వహించారని ప్రశ్నించారు. అయితే, ఈ చర్చలో ఎక్కువగా టీడీపీ భజనే జరిగిందని, కొందరు రైతులు పేర్కొన్నారు.

సొంత పార్టీ శాసనసభ్యుల డుమ్మా.

ఇంత ముఖ్యమైన సమావేశానికి జిల్లాలోని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌లకు ఆహ్వానం పంపినా హాజరుకాలేదు. కౌలు రైతుల్లో అధిక శాతం దళితులే ఉంటారు. ఆ కోటాలో ఎమ్మెల్యే అయిన రామాంజనేయులు వారి సమస్యలపై చర్చించేందుకు రావకపోవడం కొందరిని ఆగ్రహానికి గురి చేసింది. చట్టం ఎవరికీ చుట్టం కాదు.. తమకు కావాల్సిన వారిని పిలుచుకుని, పార్టీ ముద్రతో మరికొందరు ముఖ్యులను విస్మరించడం తగదని కొందరు అధికారులంటున్నారు. ఏపీ సాగుదారుల హక్కుల చట్టం-2024ను త్వరలోనే క్యాబినెట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రకటించారు.

నాటక రంగంలో ఆ నలుగురూ ట్రెండ్ సెట్టర్స్

నట దిగ్గజాల శతజయంతి సదస్సులో డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి


ఆచంట బాలాజీనాయుడుకు వెంకట్రామయ్య చౌదరి శత జయంతి స్మారక అవార్డు


వల్లూరు శివప్రసాద్‌కు కొడాలి గోపాలరావు అవార్డు


జరుగుల రామారావుకు కన్నెగంటి నాసరయ్య అవార్డు

తెనాలి: ప్రస్తుతం శతజయంతి ఉత్సవం జరుపుకుంటున్న నాటకరంగ దిగ్గజాలు వారి వారి ప్రక్రియల్లో ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచారని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, అధ్యాపకుడు, ప్రయోక్త డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అన్నారు. ప్రపంచయుద్ధం ముగిశాక 1921–30 దశాబ్దంలో 'హంగ్రీ థర్టీస్'లో జన్మించినవారు అటు గాంధీ, ఇటు మార్క్సిజం ప్రభావాలకు లోనుకుండా నాటక రచన, నటనతో తెలుగు నాటకాన్ని సుసంపన్నం చేశారని చెప్పారు. భావితరాలకు వారి స్ఫూర్తిని అందించడం అభినందనీయమని చెప్పారు. కళల కాణాచి-తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న చతుర్థ పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు, వీణా అవార్డ్-2024 సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున జిల్లాకు చెందిన నాటకరంగ దిగ్గజాలు వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కొడాలి గోపాలరావు, కన్నెగంటి నాసరయ్య, బెల్లంకొండ రామదాసు శతజయంతి సదస్సును నిర్వహించారు. డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించారు. తొలుత మాయల ఫకీర్ ఫేం వల్లూరు వెంకట్రామయ్య చౌదరి గురించి నాటక రంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడారు. బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీరు పాత్రలో నటించి ఆ నాటకాన్ని, పాత్రను దిక్కులు, చుక్కలు ఉన్నంతవరకు శాశ్వత ముద్ర వేసిన మహానటుడు వెంకట్రామయ్య చౌదరిగా చెప్పారు. తెలుగులో అంతటి సుప్రసిద్ధమైన జానపద నాటకం మరోటి లేదన్నారు. శతాధిక నాటక రచయిత కొడాలి గోపాలరావు గురించి, ఆయనపై పరిశోధన చేసిన వేల్పుల బుచ్చిబాబు మాట్లాడారు. మరుగున పడిన మహా రచయిత కొడాలి గోపాలరావు అని, నాటకానికి, సినిమాకు ఏమాత్రం తీసుపోనివిధంగా ఆయన జీవితం చిత్రమైన మలుపులు తిరిగిందన్నారు. ఆయన జీవితం, రచనలు పుస్తకరూపంగా తీసుకొస్తే, నేటితరానికి ప్రయోజం కలుగుతుందని తెలిపారు. సాంఘిక నాటకాన్ని ఒక వెలుగు వెలిగించిన కన్నెగంటి నారసరయ్య జీవితవిశేషాలపై నాటకరంగ విశ్లేషకుడు అంబటి మురళీకృష్ణ మాట్లాడారు. జాతీయభావాలు కలిగిన నాసరయ్య చిన్నవయసులోనే బుర్రకథతో స్వరాజ్య ఉద్యమానికి ఊపిరిలూదారని చెప్పారు. మరోవైపు తన కృషితో సాంఘిక నాటకానికి ఆదరణ పెరిగేలా చూశారని వివరించారు. ప్రముఖ నాటకరచయిత బెల్లంకొండ రామదాసుపై ప్రముఖ పాత్రికేయుడు రెంటాల జయదేవ మాట్లాడారు. పల్నాడుకు చెందిన రామదాసు భావకవిత్వం రాస్తూ నాటక రచనకు మళ్లినట్టు తెలిపారు. నయాగర కవుల్లో ఒకరుగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. అనంతరం జరిగిన సభలో వల్లూరు వెంకట్రామయ్య చౌదరి శతజయంతి స్మారక అవార్డును ప్రముఖ రంగస్థల నటుడు ఆచంట బాలాజీనాయుడుకు, కొడాలి గోపాలరావు శతజయంతి స్మారక అవార్డును ప్రముఖ కథా, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్, కన్నెగంటి నాసరయ్య శతజయంతి స్మారక అవార్డును నాటక రచయిత, నటుడు, దర్శకుడు జరుగుల రామారావు, బెల్లంకొండ రామదాసు శతజయంతి స్మారక అవార్డును హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల రచయిత జమ్మలమడక శశిమోహన్ బంధువుకు అందజేశారు. సభకు ముందు శ్రీదుర్గాభవాని నాట్యమండలి, తెనాలి వారిచే 'శ్రీకృష్ణరాయబారం' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. కళల కాణాచి వ్యవస్థాపకుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా స్వాగతం పలికారు. కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రి జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీ బాషా పర్యవేక్షించారు.

కలసికట్టుగా కూటమిని మట్టి కరిపిద్దాం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



సమావేశంలో మాటాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: '' మన అందరిది ఒకటే బాట.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలను అస్త్రంలా చేసుకుని.. దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవా''లని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మంగళగిరి నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల్ని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని తెలిపారు. అనుబంధ విభాగాల్ని సైతం పూర్తిస్థాయిలో పార్టీ కోసం బాధ్యతగా పనిచేసేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ఉచిత ఇసుక విషయంలో అట్టర్ ఫెయిల్యూర్ అయ్యారని తెలిపారు. మద్యం అంశంలో కూడా రూ. 30లక్షల వరకు టెండర్లు వచ్చిన వారు కట్టాలని భయపెడుతున్న పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అన్ని వర్గాలకు, ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత కల్పించేలా కమిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చిన్నాచితక భేదాల్ని పక్కనబెట్టి పార్టీ పటిష్టతే ధ్యేయంగా ప్రతి ఒక్కరం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కమిటీల ఏర్పాటులో పూర్తిస్థాయిలో కార్యకర్తలు, ప్రజల మనోభావాల్ని పరిగణలోకి తీసుకుని ముందుకు సాగేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

ఎగిసిపడే అలలకు తీసిపోరు మన కార్యకర్తలు : మోదుగుల

కడలిలో ఎగిసిపడుతున్న అలలకు తీసిపోని ధైర్యశాలులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలని గుంటూరు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. కూటమి నేతలు బెదిరింపులు, దాడులు, అక్రమ కేసులకు ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. కచ్చితంగా నిర్మాణాత్మకమైన కమిటీని ఏర్పాటు చేసుకోవటంతో పాటు, అన్ని విభాగాల్ని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పుడు ఎన్నికలు పెట్టినా.. చంద్రబాబు తుక్కుతుక్కుగా ఓడిపోవటం తథ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ అచెంచలమైన ఆత్మవిశ్వాసంతో తిరిగి 2029 ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మరుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజలకు మనం ఉన్నామనే ధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పదవుల నియామకాల్లో ప్రతి ఒక్కరి అభిప్రాయానికి విలువ ఉంటుందని తెలిపారు. పార్టీ నేత గంజి చిరంజీవి మాట్లాడుతూ అధికారం ఉన్నా.. లేకపోయినా వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని పేర్కొన్నారు. సీఎం పీఠం కోసం అడ్డదారులు తొక్కే మనస్తత్వం వైఎస్. జగన్‌కు లేదని తెలిపారు. అనంతరం పార్టీ నేతలు అంతర్గతంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.